ESHAGNA
ఛానల్‌కి సంబంధించిన Pvt Ltd ( Broadcasting ), MSME , Trademark , Food License (Fssai) , ISI License , RNI , Trust (12A-80G), రిజిస్ట్రేషన్ చేయబడును
RTMP సర్వర్ KEY, E పేపర్ వెబ్సైట్, న్యూస్ వెబ్సైట్ చేయబడును.

Registered No : APTEL/25/A1201

# గాయత్రి వార్తలు

జాతీయ తెలుగు దిన పత్రిక

విలేకరులు కావలెను
గాయత్రి వార్తలు జాతీయ తెలుగు దినపత్రికలో ఆంధ్ర ప్రదేశ్ మరియు తెలంగాణ రాష్ట్రాలలోని అన్ని నియోజకవర్గ, మండల కేంద్రాలలో పనిచేయుటకు ఆసక్తి గల విలేకరులు కావలెను.
అనుభవం ఉన్న వారికి ప్రాధాన్యత ఇవ్వబడును
యం. నాగేశ్వర రావు
ఎడిటర్ గాయత్రి వార్తలు
సెల్ : 73860 45673

PUBLISHED FROM : DELHI - MAHARASHTRA - ANDHRA PRADESH - TELANGANA - KARNATAKA - TAMILANADU - GOA - LOCKNOW - EDITOR : M. NAGESWARARAO

ప్రచురణ : ఆంధ్రప్రదేశ్ శనివారం 21-03-2026 సంపుటి : 1 సంచిక :272 ఎడిటర్ : యం నాగేశ్వరరావు పేజీలు : 4 వెల రు : 2/-

## పెట్రోల్, డీజిల్‌కు లోటు రానివ్వొద్దు

- రాష్ట్రంలో ఎల్పీజీ సమస్య తలెత్తకుండా చూడాలని అధికారులను సీఎం చంద్రబాబు ఆదేశించారు.
- ఇండక్షన్ స్టవ్‌లు, పీఎన్‌జీ, ఈవీ, ఇతర మార్గాలపై దృష్టి పెట్టాలన్నారు.
- గ్లోబల్ సప్లయ్ చైన్ దెబ్బతినక ముందే అప్రమత్తం కావాలని ఆదేశించారు. ఎల్పీజీ సరఫరాలో విద్యా సంస్థలు, ఆలయాలకు ప్రాధాన్యత ఇవ్వాలన్నారు.



ఎల్పీజీ సరఫరాపై సీఎం చంద్రబాబు సమీక్ష నిర్వహించారు. పెట్రోల్, డీజిల్, ఎరువులకు లోటు రాకుండా కేంద్రంతో మాట్లాడాలన్నారు.మరోవైపు అకాల వర్షాలతో పంట నష్టంపై కలెక్టర్లతో సీఎం చంద్రబాబు సమీక్ష నిర్వహించారు. అకాల వర్షాలతో దెబ్బతిన్న పంటల వివరాలు తెలుసుకున్నారు. 12 జిల్లాల్లో మొక్కజొన్న, వరి, మినపకు నష్టం వాటిల్లిందని అధికారులు వివరించారు. దీని విలువ దాదాపు రూ.40 కోట్లుగా ఉంటుందని అన్నారు. 9 జిల్లాల్లో అరటి, బొప్పాయి, మిరప, మామిడి, బత్తాయి, నిమ్మకు నష్టం వాటిల్లిందని, దీని విలువ రూ.22.68 కోట్లుగా అంచనా వేసినట్లు చెప్పారు.

## ఐఐటీ దిల్లీకి పూర్వ విద్యార్థి యార్డీ విరాళం రూ.75 కోట్లు





కృత్రిమమేధ రంగంలో చేపడుతున్న అత్యాధునిక పరిశోధనలను మరింత ముందుకు నడిపించేలా తమ పూర్వ విద్యార్థి, యార్డీ సిస్టమ్స్ వ్యవస్థాపకుడు అనంత్ యార్డీ రూ.75 కోట్లు విరాళంగా ఇచ్చారని ఐఐటీ దిల్లీ గురువారం ప్రకటించింది. 1968 బ్యాచ్‌కు చెందిన అనంత్ యార్డీ (79) విద్యపరంగా తనకు బలమైన పునాదిని అందించిన సంస్థకు కృతజ్ఞతలు తెలియజేశారు. మరోవైపు.. మెటీరియల్స్ ఇంజినీరింగ్ అనే సంక్లిష్ట విషయాన్ని ఆసక్తికరంగా, సులువుగా చెప్పేందుకు ఐఐటీ దిల్లీ తొలిసారిగా కామిక్ పుస్తకాన్ని రూపొందించింది. భవిష్యత్తులో మరిన్ని కామిక్ పుస్తకాలను విడుదల చేస్తామని అధికారులు వెల్లడించారు.

## మధుమేహ నియంత్రణకు.. రూ.1290కే నాట్కో ఫార్మా నుంచి సెమాగ్లుటైడ్

టైప్-2 మధుమేహం నియంత్రణ కోసం జనరిక్ సెమాగ్లుటైడ్ ఇంజెక్షన్‌ను నాట్కో ఫార్మా ఆవిష్కరించింది. పేటెంట్ ముగిసిన రోజే దీన్ని తీసుకొచ్చింది. ధర నెలకు రూ.1290 నుంచి ప్రారంభమవుతుంది. ఇప్పటికే దీని తయారీకి సెంట్రల్ డ్రగ్స్ స్టాండర్డ్ కంట్రోల్ ఆర్గనైజేషన్ నుంచి ఫిబ్రవరిలో అనుమతి పొందింది.

NATCO

## నిరుద్యోగ యువతకు భరోసా

- 10,060 పోస్టులతో జాబ్ క్యాలెండర్ విడుదల చేసిన ప్రభుత్వం
- నాలుగు విడతల్లో 41 నోటిఫికేషన్లతో ఉద్యోగాల భర్తీ
- పాఠశాల విద్యలో అత్యధికంగా 3,004, హోంశాఖలో 2,778 పోస్టులు
- నైపుణ్యం పోర్టల్‌లో వివరాల నమోదుతో అభ్యర్థులకు ప్రకటనల సందేశాలు
- యువగళం పాదయాత్ర హామీని నెరవేర్చామన్న మంత్రి లోకేశ్



ఉగాది రోజున నిరుద్యోగులకు రాష్ట్ర ప్రభుత్వం తీపికబురు అందించింది. 10,060 పోస్టులతో జాబ్ క్యాలెండర్‌ను విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్ ఎక్స్‌లో విడుదల చేశారు. క్యాలెండర్ విడుదల చేయడమే కాకుండా పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ తేదీలను ముందే ప్రకటించారు. గతంలో క్యాలెండర్ మాత్రమే ఇస్తుండగా.. ఈసారి నోటిఫికేషన్ల తేదీలనూ ఇచ్చారు. నాలుగు విడతల్లో అన్ని పోస్టుల భర్తీకి 41 నోటిఫికేషన్లు విడుదల చేయనున్నారు. డీఎస్సీ, పోలీసు నియామకాలు మినహా అన్నింటినీ ఏపీపీఎస్సీ ద్వారానే భర్తీ చేయనున్నారు. విశ్వవిద్యాలయాల్లో 1,500 అసోసియేట్, సహాయ ఆచార్యుల పోస్టుల నోటిఫికేషన్‌తో నియామక ప్రక్రియ ప్రారంభం కానుంది. మే 15న ఈ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేస్తారు. సహాయ ఆచార్యుల పోస్టులకు 2018లో నిర్వహించినట్లే ఏపీపీఎస్సీ ద్వారా స్క్రీనింగ్ పరీక్ష నిర్వహిస్తారు. అత్యధికంగా పాఠశాల విద్యలో 3,004 ఉద్యోగాలు భర్తీ చేయనుండగా.. తర్వాత హోంశాఖలో 2,778 పోస్టులు ఉన్నాయి.


### డీఎస్సీలో 2,535 పోస్టులు

2,535 ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ అక్టోబరు 15న విడుదల చేయనున్నారు. ప్రతి ఏటా డీఎస్సీ ఇస్తామని ఇప్పటికే మంత్రి లోకేశ్ ప్రకటించారు. దీంతో ఖాళీలు, పదవీవిరమణతో వచ్చేవాటిని కలిపి నాలుగేళ్లకు విభజించి పోస్టులను ప్రకటించారు. ఈసారి డీఎస్సీలో ప్రత్యేక ఉపాధ్యాయ, ఎస్జీటీ, స్కూల్ అసిస్టెంట్ పోస్టులతో పాటు మ్యూజిక్, క్రాఫ్ట్, ఆర్ట్, డ్యాన్స్ టీచర్ ఖాళీలనూ భర్తీచేస్తారు.

### పాదయాత్ర హామీ నెరవేరింది: మంత్రి లోకేశ్

యువగళం పాదయాత్రలో జాబ్ క్యాలెండర్ విడుదల చేస్తామని తాను ఇచ్చిన హామీని ప్రజా ప్రభుత్వం నెరవేర్చడంతో చాలా సంతోషంగా ఉందని విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్ ఎక్స్‌లో తెలిపారు.


## 20 లక్షల ఉద్యోగాల కల్పన హామీ నెరవేరుస్తాం



- శ్రీపరాభవ నామ సంవత్సరంలో ప్రజలందరికీ మంచి జరగాలి
- తెలుగుజాతిని అగ్రస్థానంలో నిలిపేలా సంకల్పం తీసుకుందాం
- ఉగాది వేడుకల్లో ముఖ్యమంత్రి చంద్రబాబు
- 38 మందికి కళారత్న, 112 మందికి ఉగాది పురస్కారాల ప్రదానం

ఒకప్పుడు అంతా ఉమ్మడిగా ఉండే సంప్రదాయం ఉండేది. పాపులేషన్ మేనేజ్‌మెంట్ పాలసీతో మళ్లీ జనాభా పెంచేలా చర్యలు చేపడుతున్నాం. రెండు, మూడో బిడ్డ పుట్టినరోజే రూ.25వేల చొప్పున ప్రోత్సాహకాన్ని తల్లిదండ్రుల బ్యాంకుఖాతాలో జమచేస్తాం.ఇక పేపర్ పట్టుకుని పనిచేసే పరిస్థితి ఉండదు. పాలనలో పూర్తిస్థాయి సాంకేతికత వినియోగిస్తున్నాం. ఎక్కడికి వెళ్లినా అక్కడి నుంచే పాలన అందిస్తాం. వాతావరణం, ప్రకృతి వైపరీత్యాలు సహా అన్ని పరిస్థితుల్లోనూ అప్పటికప్పుడు అధ్యయనం చేసి వెంటనే నిర్ణయాలు తీసుకునే పరిస్థితి ఇప్పటికే వచ్చింది. ఏటా ఉగాది రోజున జాబ్ క్యాలెండర్ విడుదల చేస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబు వెల్లడించారు. ఏపీపీఎస్సీ ద్వారా 10,060 ఉద్యోగాలు భర్తీచేసేందుకు ఈసారి జాబ్ క్యాలెండర్ విడుదల చేసినట్లు ఆయన ప్రకటించారు. మే 15 నుంచి అక్టోబరు వరకు వివిధ నోటిఫికేషన్ల ద్వారా ఉద్యోగాలు భర్తీచేస్తామని వివరించారు. 20 లక్షల ఉద్యోగాల కల్పన హామీ నెరవేరుస్తామని అన్నారు. ఉగాది పచ్చడి జీవితాలను ప్రతిబింబిస్తుందని, షడ్రుచుల తరహాలో జీవితంలోనూ కష్టసుఖాలు ఉంటాయని ఆయన అభిప్రాయపడ్డారు. 2047 నాటికి తెలుగుజాతిని అగ్రస్థానంలో నిలిపేలా సంకల్పం తీసుకుని ముందడుగు వేద్దామని ప్రజలకు పిలుపునిచ్చారు. విజయవాడలోని తుమ్మలపల్లి కళాక్షేత్రంలో గురువారం నిర్వహించిన శ్రీపరాభవ నామ సంవత్సర ఉగాది వేడుకల్లో సీఎం పాల్గొన్నారు. మంత్రులు ఆనం రామనారాయణరెడ్డి, కందుల దుర్గేష్, ఇతర ప్రజాప్రతినిధులతో కలిసి సీఎం పంచాగశ్రవణం చేశారు. సంగీత, సాహిత్య, కళారంగాల్లో విశేషకృషి చేసిన 38 మందికి కళారత్న, 112 మందికి ఉగాది పురస్కారాలు సీఎం అందించారు. వ్యవసాయ, ఉద్యాన, తితిదే పంచాంగాలు, సాంస్కృతికశాఖ, శిల్పారామం వార్షిక కార్యక్రమాల క్యాలెండర్లను ముఖ్యమంత్రి ఆవిష్కరించారు.

## ఇప్పటికైనా చెల్లికి జగన్ న్యాయం చేస్తాడని ఆశిస్తున్నా: విజయమ్మ



కుటుంబ ఆస్తుల పంపకాలపై నేషనల్ కంపెనీ లా ట్రైబ్యునల్ (ఎన్‌సీఎల్‌టీ)లో వివాదం కొనసాగుతున్న వేళ దివంగత ముఖ్యమంత్రి వైఎస్ఆర్ సతీమణి విజయమ్మ మీడియాకు అడ్వకేట్ నోటరీ విడుదల చేశారు. వైకాపా నేతలు చేస్తున్న ఆరోపణలపై అందులో పూర్తిస్థాయి స్పష్టత ఇచ్చారు. ఆస్తుల విషయంలో చెల్లెలు, ఆమె పిల్లలకు జగన్ అన్యాయం చేశారని అన్నారు. ఆస్తుల పంపకం ఎప్పుడూ జరగలేదని, వైఎస్ మరణించే వరకు ఉన్న ఆస్తులన్నీ కుటుంబ ఆస్తులేనని ఆమె అన్నారు. “ తన ఆస్తులన్నీ నలుగురు మనవలు, మనవరాళ్లకు సమానంగా పంచాలని వైఎస్ఆర్ ఉద్దేశం. ఇది ఆయన ఆదేశం కూడా. దగ్గర వాళ్లందరికీ తెలిసిన వాస్తవమిది. ఎంవోయూలో షర్మిలకు రాసిన ప్రతి ఆస్తి న్యాయంగా ఆమెకు దక్కాల్సిందే. షర్మిల హక్కుకు అనుగుణంగానే జగన్ ఎంవోయూ రాశాడు.

## రానున్న 24 గంటల్లో ఏపీలోని పలు జిల్లాల్లో వర్షాలు



పశ్చిమ బంగాళాఖాతం సమీప ఉత్తరాంధ్ర ప్రాంతంలో ఉపరితల ఆవర్తనం కొనసాగుతోంది. రానున్న 24 గంటల్లో ఉత్తరాంధ్ర, కోస్తాంధ్ర, రాయలసీమ ప్రాంతాల్లోని కొన్ని జిల్లాల్లో జల్లులు పడే అవకాశముంది. 30 నుంచి 40 కిలోమీటర్ల వేగంతో తేలికపాటి గాలులు వీచే అవకాశం ఉన్నట్లు విశాఖ తుపాను హెచ్చరికల కేంద్రం డిప్యూటీ డైరెక్టర్ కేవీఎస్ శ్రీనివాస్ తెలిపారు. సముద్ర మట్టానికి 3.1 కి.మీ ఎత్తులో ఉపరితల ఆవర్తనం కొనసాగుతున్నట్లు చెప్పారు. గంగా పరివాహక ప్రాంతంలోని బెంగాల్, ఛత్తీస్‌గఢ్, ఒడిశాలోనూ ఉపరితల ఆవర్తనం కొనసాగుతున్నట్లు చెప్పారు.

# జాబ్ క్యాలెండర్‌తో యువతకు ఊపిరి సీఎం చిత్రపటానికి పాలాభిషేకం

**శ్రీకాళహస్తి,మార్చి 20,గాయత్రి వార్తలు :రిపోర్టర్ : రంజిత్**

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర యువతకు ఉపాధి అవకాశాలు కల్పించడంలో భాగంగా జాబ్ క్యాలెండర్ విడుదల చేసి నమ్మకాన్ని నిలబెట్టిందని తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యదర్శి డా. జి. దశరథాచారి, బీసీ విభాగం రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి డా. ఎం. ఉమేష్ రావు తెలిపారు. శుక్రవారం శ్రీకాళహస్తి పట్టణం 18వ వార్డు పరిధిలోని పూసల వీధిలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు చిత్రపటానికి పాలాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, ఎన్నికల హామీ మేరకు ఎన్డీయే కూటమి ప్రభుత్వం ఉద్యోగాల కల్పనకు కట్టుబడి జాబ్ క్యాలెండర్ విడుదల చేయడం అభినందనీయమన్నారు. ఉగాది సందర్భంగా 10,060 పోస్టులతో జాబ్



క్యాలెండర్ ప్రకటించడం యువతకు ఊరటనిచ్చిందన్నారు. మే 15 నుంచి అక్టోబర్ 15 వరకు వివిధ ప్రభుత్వ శాఖల్లో నోటిఫికేషన్లు విడుదల కానున్న నేపథ్యంలో, ఉద్యోగార్థులు సన్నద్ధతతో అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అదే విధంగా గతంలో ఇచ్చిన హామీలను నిలబెట్టుకోలేని వైసీపీ ప్రభుత్వంపై విమర్శలు గుప్పించారు. యువగళం పాదయాత్రలో ఇచ్చిన హామీ మేరకు మంత్రి నారా లోకేష్ జాబ్ క్యాలెండర్ విడుదల చేయడం ద్వారా విశ్వసనీయతను చాటుకున్నారని పేర్కొన్నారు. రాష్ట్రంలో పెట్టుబడులు, పరిశ్రమల స్థాపనతో ప్రైవేటు రంగంలోనూ పెద్ద ఎత్తున ఉద్యోగ అవకాశాలు కల్పించబడనున్నాయని తెలిపారు. ఎన్డీయే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 21 నెలల్లో ప్రభుత్వ, ప్రైవేటు రంగాల్లో 6 లక్షలకుపైగా ఉద్యోగాలు కల్పించిందని చెప్పారు. ఈ కార్యక్రమంలో వన్నెకుల క్షత్రియ సంక్షేమం మరియు అభివృద్ధి కార్పొరేషన్ డైరెక్టర్ మిన్నల్ రవి, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గిరిజన సలహా మండలి సభ్యులు ఎం. సుబ్బయ్య, తంగేళ్లపాలెం పిఏసియస్ ఛైర్మన్ బీమాల భాస్కర్, శ్రీకాళహస్తి పట్టణ కార్యనిర్వాహక కార్యదర్శి వజ్రం కిషోర్, నాయీ బ్రాహ్మణ సాధికార సమితి తిరుపతి పార్లమెంటు సోషల్ మీడియా కన్వీనర్ కోట చంద్రశేఖర్, తొట్టంబేడు మండలం తెలుగు యువత అధ్యక్షుడు బీమాల చంద్రబాబు (చందు), శ్రీకాళహస్తి పురపాలక సంఘం మాజీ కౌన్సిలర్ షేక్ మహబూబ్ బాషా, తిరుపతి పార్లమెంటు నాయకులు ఆనంద్ రెడ్డి, సయ్యద్ ముజీబ్, గాజుల భగత్, సులేమాన్, గంగనపల్లి రమేష్, సయ్యద్ ఆదిల్, వెంకటస్వామి, కృష్ణయ్య, సుబ్రహ్మణ్యం, మారయ్య, సలార్ తదితరులు పాల్గొన్నారు.

# మాట నిలబెట్టుకున్న కూటమి ప్రభుత్వం

**– జాబు క్యాలెండర్ విడుదలపై ఎమ్మెల్యే బడేటి చంటి వ్యాఖ్య**

**గాయత్రి వార్తలు ఏలూరు జిల్లా ఇంచార్జ్ బి ప్రభాకర్**

రాష్ట్రంలోని యువతకు బంగారు భవిష్యత్తు అందించేందుకు ఉగాది రోజున జాబ్ క్యాలెండర్ విడుదల చేసి కూటమి ప్రభుత్వం తన చిత్తశుద్ధిని నిరూపించుకుందని జిల్లా టిడిపి అధ్యక్షులు, ఏలూరు ఎమ్మెల్యే బడేటి చంటి పేర్కొన్నారు. నిరుద్యోగులకు 20 లక్షల ఉద్యోగాల కల్పనే లక్ష్యంగా ప్రభుత్వం పని చేస్తోందన్నారు. ఏలూరు పవర్ పేట లోని తన క్యాంపు కార్యాలయంలో శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడారు. యువగళంలో ఇచ్చిన హామీని మంత్రి లోకేష్ నిలబెట్టుకున్నారని, కొత్త సంవత్సరం రోజున జాబ్ క్యాలెండర్ విడుదల చేసి నిరుద్యోగ యువతకు కూటమి ప్రభుత్వం తీపి కబురు అందించిందని చెప్పారు. అంతేకాకుండా దీనివల్ల యువత భవిష్యత్తుకు భరోసా లభిస్తుందన్నారు. ఒకేసారి వివిధ శాఖల పరిధిలో పదివేల అరవై పోస్టుల భర్తీకి ప్రభుత్వం స్వీకారం చుట్టిందని ఆయన చెప్పారు. ఇప్పటికే 20 నెలల్లో ఆరు లక్షల 28 వేల 347 ఉద్యోగాలను యువతకు అందించడం జరిగిందన్నారు. స్కిల్ డెవలప్మెంట్ ప్రోగ్రాం, డీఎస్సీ, ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లు తదితర వాటి ద్వారా ఈ ఉద్యోగాల కల్పన జరిగిందని ఎమ్మెల్యే పేర్కొన్నారు. యువతకు భవిష్యత్తులో కూడా మరిన్ని ఉద్యోగ అవకాశాలు కల్పించాలన్న లక్ష్యంతో విశాఖపట్నం, నెల్లూరు వంటి ప్రాంతాల్లో అనేక కంపెనీలను తీసుకువస్తూ, భవిష్యత్తులో మరో 25 లక్షల ఉద్యోగాలు సృష్టించేలా ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. యువత ఇతర రాష్ట్రాలకు వెళ్లాల్సిన అవసరం లేకుండా రాష్ట్రంలోనే ఉపాధి పొందేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు.



ఇదిలా ఉండగా వైసీపీ నాయకులపై ఎమ్మెల్యే చంటి తీవ్ర విమర్శలు చేశారు. పెట్టుబడులు పెట్టే వారిని బెదిరిస్తూ, అధికారంలోకి వచ్చిన తర్వాత వాటిని స్వాధీనం చేసుకుంటామని హెచ్చరిస్తున్నారని మండిపడ్డారు. క్రమశిక్షణతో పని చేస్తున్న వారిని ప్రోత్సహించాల్సిన అవసరం ఉందని, అనవసర ఆరోపణలు చేయడం సరైంది కాదని ఎమ్మెల్యే బడేటి చంటి స్పష్టం చేశారు. వైసీపీ విధ్వంస పాలనలో నిరుద్యోగులను జగన్మోహన్ రెడ్డి నిలువునా మోసం చేశారని ఆయన మండిపడ్డారు. యువత భవిష్యత్తును నాశనం చేయడంతో పాటు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లేకుండా చేశారని ఆయన తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. మీడియా సమావేశంలో ఏఎంసీ ఛైర్మన్ మామిళ్ళపల్లి పార్థసారథి, డిప్యూటీ మేయర్ కర్రీ శ్రీనివాసరావు, ఏలూరు నగర టిడిపి అధ్యక్ష, కార్యదర్శులు చోడే వెంకటరత్నం, రెడ్డి నాగరాజు,తదితరులు పాల్గొన్నారు

# నిర్దేశించిన లక్ష్యాలను పూర్తిచేయాలి

**– జిల్లా కలెక్టర్ కె.వెట్రిసెల్వి ఆదేశాలు**

**గాయత్రి వార్తలు ఏలూరు జిల్లా ఇంచార్జ్ బి ప్రభాకర్**

ఏలూరు జిల్లాలో ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో వివిధ శాఖలకు ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాలను ఈనెల 25వ తేదీ లోగా నూరుశాతం పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ కె. వెట్రిసెల్వి అధికారులను ఆదేశించారు. స్థానిక కలెక్టరేట్లో శుక్రవారం జిల్లాలోని సంక్షేమ అభివృద్ధి శాఖలకు ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో నిర్దేశించిన లక్ష్యాలు, లక్ష్యసాధనలపై అధికారులతో కలెక్టర్ సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ వెట్రిసెల్వి మాట్లాడుతూ ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ముగుస్తున్న దృష్ట్యా అధికారులు తమ శాఖలకు సంబంధించి ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాలను పూర్తి చేసేందుకు శ్రద్ధ తీసుకోవాలన్నారు. డ్వాక్రా సంఘాల రుణలక్ష్యాలను పూర్తి చేయడంతోపాటు రుణాలతో స్వయం సహాయక సంఘాల మహిళలు ఉపాధి యూనిట్లు నెలకొల్పేలా చర్యలు తీసుకోవాలన్నారు. బీసీ, ఎస్సి కార్పొరేషన్ ద్వారా యువత స్వయం ఉపాధికి రుణ మంజూరు లక్ష్యాలను పూర్తిచేసి, యూనిట్ల ఏర్పాటు వేగవంతం చేయాలన్నారు. పంచాయతీ రాజ్, గృహ నిర్మాణ శాఖ, ఆర్ డబ్ల్యూ ఎస్., సమగ్ర శిక్ష, రోడ్లు, భవనాలు, వంటి ఇంజనీరింగ్ శాఖల అధికారులు చేపట్టిన నిర్మాణ పనులు పూర్తిచేసి, బిల్లులను చెల్లింపు నిమిత్తం వెంటనే




ఆన్లైన్ లో అప్లోడ్ చేయాలన్నారు. నిర్దేశించిన లక్ష్యాల సాధనలో వెనుకబడిన అధికారులపై చర్యలకు ప్రభుత్వానికి సిఫారసు చేయడం జరుగుతుందని, అందుకు అధికారులు సిద్ధంగా ఉండాలని కలెక్టర్ హెచ్చరించారు. సంక్షేమ కార్యక్రమాలను ప్రజలలోనికి మరింత సమర్థవంతంగా తీసుకువెళ్లాలని, జిలాల్లో ప్రజల సంతృప్తి స్థాయి తక్కువగా ఉన్న ప్రభుత్వ సేవల విభాగంలో ప్రజల సంతృప్తి స్థాయిని మరింత పెంచేలా ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు సమావేశంలో డిఆర్ఓ వి. విశ్వేశ్వరరావు, ఏలూరు నగరపాలక సంస్థ కమీషనర్ ఏ. భానుప్రతాప్, ఆర్. డబ్ల్యూ. ఎస్., ఎస్ఈ త్రినాధ్ బాబు, ఆర్అండ్ బి ఈఈ వై. వి. కిషోర్ బాబూజీ, డిఎంహెచ్ఓ డా. శోభ, డిసిహెచ్ఎస్ డా. పాల్ సతీష్, డిఈఓ వెంకటలక్ష్మమ్మ, ప్రభృతులు పాల్గొన్నారు.

# సహాయం పేరుతో వేధింపులు.. పోలీసులకు ఫిర్యాదు

**శ్రీకాళహస్తి,మార్చి 20,గాయత్రి వార్తలు :రిపోర్టర్ : రంజిత్**

ప్రభుత్వ ప్రయోజనాలు పొందేందుకు కార్యాలయాన్ని ఆశ్రయించిన ఓ ఒంటరి మహిళకు వేధింపులు ఎదురైన ఘటన శ్రీకాళహస్తిలో ఆందోళన కలిగిస్తోంది. తెలుగు గంగ కాలనీలో నివసిస్తున్న బాధితురాలు, తనకు ఎదురైన అన్యాయంపై పోలీసులను ఆశ్రయించింది. బాధితురాలి విన్నపం మేరకు... ఆమె కుటుంబ సభ్యుడు తెలుగు గంగ ప్రాజెక్టులో ఉద్యోగిగా పనిచేస్తూ మరణించగా, ఆయనకు సంబంధించిన బెనిఫిట్స్ కోసం కార్యాలయాన్ని సంప్రదించింది. ఈ క్రమంలో అక్కడ పనిచేస్తున్న ఓ ఉద్యోగి, మొదట సహాయం చేస్తానని చెప్పి తర్వాత పదేపదే ఫోన్‌లు చేస్తూ ఇబ్బందులకు గురిచేసినట్లు ఆరోపించింది. తరువాత కార్యాలయంలో స్వీపర్ ఉద్యోగం ఇస్తానని చెప్పి, తనను ఒత్తిడి చేయడంతో పాటు అసభ్యకరంగా ప్రవర్తించాడని బాధితురాలు వాపోయింది. దీనిని వ్యతిరేకిస్తూ ఆమె ప్రశ్నించగా, విషయాన్ని మనసులో పెట్టుకుని మరింత వేధింపులకు దిగినట్లు తెలిపింది. అదే కార్యాలయానికి చెందిన మరో వ్యక్తి సహకారంతో తనపై ఒత్తిడి తెచ్చే ప్రయత్నాలు జరుగుతున్నాయని, ఇంటి వద్దకు వచ్చి అనుచితంగా ప్రవర్తించడం, తప్పుడు ప్రచారం చేయడం, రాత్రివేళల్లో భయభ్రాంతులకు గురిచేయడం వంటి ఘటనలు చోటుచేసుకుంటున్నాయని ఆవేదన వ్యక్తం చేసింది. ఈ పరిస్థితుల్లో తాను, తన కుమార్తె తీవ్ర భయాందోళనలకు గురవుతున్నామని, ఏ క్షణంలోనైనా ప్రమాదం జరిగే అవకాశముందని పేర్కొంది. దీంతో ఈ నెల 16న టూ టౌన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు తెలిపింది. తమకు రక్షణ కల్పించి, బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని బాధితురాలు పోలీసులను వేడుకుంది. ఈ ఘటనపై పోలీసులు విచారణ చేపట్టాల్సి ఉంది.



# లింగపాలెం మండలంలో ఘరానా మోసం:

**– బాధితులపై దాడి చేసిన ఫెర్టిలైజర్ షాపు యజమాని బెతిన మధు.**



**గాయత్రి వార్తలు ఏలూరు జిల్లా ఇంచార్జ్ బి ప్రభాకర్**

బాధితురాలు తెలిపిన వివరాలు ప్రకారం.. వ్యాపార అభివృద్ధి పేరుతో డిపాజిట్లు వసూలు చేసి తిరిగి అడుగినందుకు బాధితులపై భౌతిక దాడికి దిగిన ఘటన లింగపాలెం మండలంలో కలకలం రేపింది. తోచిలక రాయుడుపాలెం గ్రామానికి చెందిన వలిమి ధనలక్ష్మి భర్త అప్పారావు వీరికి ముగ్గురు అమ్మాయిలు. వీరు రోజువారి కూలి పని చేసుకుని కొంత డబ్బును లింగపాలెం గ్రామంలోని శ్రీ సాయిరాం ట్రేడర్స్ లో డిపాజిట్ చేశారు. వారి కుటుంబ అవసరాల నిమిత్తం డబ్బులు అడగగా మాపై దుర్భాషలాడి దాడిచేసిన బెతిన నాగ వెంకట మధు, అని బాధితురాలు ఆరోపిస్తున్నారు. డిపాజిట్ గా తీసుకున్న డబ్బును తిరిగి ఇప్పించాలని నాయకులు, అధికారులను బాధితురాలు కోరుతున్నారు.

# రైతాంగాన్ని ఆదుకోవాలి

**– ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం డిమాండ్**




**గాయత్రి వార్తలు ఏలూరు జిల్లా ఇంచార్జ్ బి ప్రభాకర్**

అకాల వర్షాలకు పంటలు దెబ్బతిని నష్టపోయిన రైతాంగాన్ని ప్రభుత్వం తక్షణమే ఆదుకోవాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి కె. శ్రీనివాస్ డిమాండ్ చేశారు. శుక్రవారం అన్నే భవనంలో అకాల వర్షాల పంట నష్టాలపై ఆయన మాట్లాడారు. నిన్న, మొన్న కురిసిన అకాల వర్షాలకు, ఈదురు గాలులకు జిల్లాలో మొక్కజొన్న, మినుము, పొగాకు, మిర్చి, అరటి, మామిడి తదితర పంటలకు నష్టం వాటిల్లిందని చెప్పారు. పంటలకు పూర్తి పెట్టుబడి పెట్టి పంట చేతికి వచ్చే దశలో పంటలు దెబ్బ తినడంతో అన్నదాతలు దిక్కుతోచని స్థితిలో ఉన్నారని ఆవేదన వ్యక్తం చేశారు. జిల్లాలో ముదినేపల్లి, నూజివీడు, చాట్రాయి, కుకునూరు, వేలేరుపాడు తదితర మండలాల్లో పంటలకు నష్టం వచ్చిందని చెప్పారు. పంట నష్టాలను వెంటనే అంచనా వేయాలని కోరారు. పెట్టుబడి ఖర్చులకు అనుగుణంగా నష్టపరిహారాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. పంటల బీమా పథకం వర్తింపజేయాలని కోరారు. నష్టపోయిన రైతాంగాన్ని ప్రభుత్వాలు అన్ని విధాల ఆదుకోవాలని లేనిపక్షంలో ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు.

# రంజాన్ పర్వదిన శుభాకాంక్షలు తెలిపిన గంగలపూడి గిరిధర్ రెడ్డి



**శ్రీకాళహస్తి, మార్చి 20,గాయత్రి వార్తలు:రిపోర్టర్ : రంజిత్**

చిందేపల్లి శ్రీ పార్వతీ సమేత సిద్దేశ్వర స్వామి ఆలయ ధర్మకర్త గంగలపూడి గిరిధర్ రెడ్డి, పవిత్ర రంజాన్ పర్వదినాన్ని పురస్కరించుకుని శ్రీకాళహస్తి నియోజకవర్గంలోని ముస్లిం సోదర సోదరీమణులకు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రంజాన్ మాసం ఇస్లాం మతంలో అత్యంత పవిత్రమైనదిగా పేర్కొంటూ, ఉపవాస దీక్షలు ఆచరించడం ద్వారా మనసు శుద్ధి, నియమ నిష్ఠలు పెంపొందుతాయని అన్నారు. ఉపవాసం ద్వారా సహనం, సహకారం, సోదరభావం వంటి విలువలు పెంపొందుతాయని వివరించారు. పేదవారికి సహాయం చేయడం, దానం చేయడం రంజాన్ మాసం యొక్క ముఖ్య లక్షణమని, సమాజంలో పరస్పర ప్రేమ, ఐక్యత మరింత బలపడాలని ఆకాంక్షించారు. ఈ పవిత్ర పర్వదినాన్ని ప్రతి ఒక్కరూ ఆనందంగా, శాంతియుతంగా జరుపుకోవాలని పిలుపునిచ్చారు. శ్రీకాళహస్తి నియోజకవర్గ ప్రజలందరికీ, ముఖ్యంగా ముస్లిం సోదర సోదరీమణులకు సుఖశాంతులు, ఆయురారోగ్యాలు, అష్టైశ్వర్యాలు కలగాలని గంగలపూడి గిరిధర్ రెడ్డి ప్రార్థించారు.

# భక్తి, నియమ నిష్టలకు ప్రతీక రంజాన్ సుధీర్ రెడ్డి

శ్రీకాళహస్తి,మార్చి 20,గాయత్రి వార్తలు :రిపోర్టర్ : రంజిత్



శ్రీకాళహస్తి శాసనసభ్యులు బొజ్జల వెంకట సుధీర్ రెడ్డి, పవిత్ర రంజాన్ పర్వదినాన్ని పురస్కరించుకుని నియోజకవర్గంలోని ముస్లిం సోదర సోదరీమణులకు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రంజాన్ మాసం ఆత్మశుద్ధి, నియమ నిష్టలు, సహనం, దయా గుణం, సమానత్వం వంటి గొప్ప విలువలను బోధించే పవిత్ర కాలమని పేర్కొన్నారు. ఈ మాసంలో ముస్లింలు భక్తిశ్రద్ధలతో ఉపవాస దీక్షలు ఆచరించడం అభినందనీయమని అన్నారు.ఇన్ని రోజులు ఆచరించిన ఉపవాసాలకు అల్లాహ్ కరుణ కటాక్షాలు ఎల్లప్పుడూ ఉండాలని, వారి ప్రార్థనలు ఫలించి కుటుంబాలు ఆయురారోగ్యాలతో, సుఖశాంతులతో వర్ధిల్లాలని ఆకాంక్షించారు. రంజాన్ మాసం ప్రేమ, పంచుకోవడం, పరస్పర గౌరవం, సోదరభావం పెంపొందించే సమయమని తెలిపారు.ఈ పవిత్రతను జీవితాల్లో నిలబెట్టుకుంటూ సమాజంలో శాంతి, సౌభ్రాతృత్వం మరింత బలపడాలని సుధీర్ రెడ్డి పిలుపునిచ్చారు. నియోజకవర్గ ప్రజలందరికీ సుఖసంతోషాలు కలగాలని ఆయన ఆకాంక్షించారు.

# మతసామరస్యానికి ప్రతీక రంజాన్ పండుగ

**– నెమళ్ళూరు బుజ్జి**

శ్రీకాళహస్తి, మార్చి 20,గాయత్రి వార్తలు :రిపోర్టర్ : రంజిత్



మతసామరస్యానికి రంజాన్ పండుగ ప్రతీక అని తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు, 22వ వార్డు యూనిట్ ఇంచార్జ్ నెమళ్ళూరు బుజ్జి అన్నారు, ఆయన మాట్లాడుతూ శ్రీకాళహస్తి నియోజకవర్గంలోని ముస్లిం సోదరులకు శుభాకాంక్షలు తెలియజేశారు. ముస్లిం సోదరులు భక్తిశ్రద్ధలతో రంజాన్ పర్వదినాన్ని జరుపుకోవాలని అన్నారు.

# ఏపీడబ్ల్యూజేఎఫ్ సభలకు సన్నాహాలు జోరు

శ్రీకాళహస్తి, మార్చి 20,గాయత్రి వార్తలు :రిపోర్టర్ : రంజిత్



ఈ నెల 22న తిరుపతిలో జరగనున్న ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ (ఏపీడబ్ల్యూజేఎఫ్) ప్రథమ జిల్లా మహాసభలను జయప్రదం చేయాలని శ్రీకాళహస్తి నియోజకవర్గ అధ్యక్షుడు వెంకటేష్, కార్యదర్శి రఘు పిలుపునిచ్చారు.శుక్రవారం స్థానిక పుచ్చలపల్లి సుందరయ్య భవనంలో మహాసభల కరపత్రాలు, గోడపత్రికలను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా శ్రీకాళహస్తి ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు వేణుగోపాల్ హాజరయ్యారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, వర్కింగ్ జర్నలిస్టుల సమస్యల పరిష్కారంలో ఫెడరేషన్ ముందుండి పోరాటం చేస్తుందని తెలిపారు. జర్నలిస్టులకు ఇంటి స్థలాల కేటాయింపులో ప్రభుత్వాలు నిర్లక్ష్యం వహిస్తున్నాయని విమర్శించారు. ఇతర రాష్ట్రాల్లో రిటైర్డ్ జర్నలిస్టులకు పెన్షన్ సదుపాయం ఉన్నప్పటికీ, ఆంధ్రప్రదేశ్‌లో అమలు చేయకపోవడం బాధాకరమన్నారు.రైల్వే పాస్‌ల పునరుద్ధరణ, అక్రిడిటేషన్ల మంజూరులో నిబంధనల సడలింపు, చిన్న పత్రికలకు ప్రాధాన్యత కల్పించాల్సిన అవసరం ఉందని డిమాండ్ చేశారు. అలాగే జర్నలిస్టులకు ఆరోగ్య, ప్రమాద బీమా సౌకర్యాలు కల్పించాలని కోరారు. జర్నలిస్టులపై దాడులను అరికట్టేందుకు మీడియా కమిషన్ ఏర్పాటు చేసి గవర్నింగ్ బాడీని నియమించాలని విజ్ఞప్తి చేశారు.కార్యక్రమంలో పలువురు సీనియర్ పాత్రికేయులు పాల్గొన్నారు.

# ఎన్‌సీఎస్‌టి ఛైర్మన్‌కు ఘన స్వాగతం

శ్రీకాళహస్తి, మార్చి 20,గాయత్రి వార్తలు :రిపోర్టర్ : రంజిత్



ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం ట్రైబల్ వెల్ఫేర్ శాఖ ఆధ్వర్యంలో నెల్లూరు జిల్లా పరిషత్ సమావేశ హాల్‌లో నిర్వహించిన సమీక్ష సమావేశం జరిగింది.ఈ సమావేశంలో నేషనల్ కమిషన్ ఫర్ షెడ్యూల్డ్ ట్రైబ్స్ ఛైర్మన్ అంతర్ సింగ్ ఆర్యా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గిరిజన సలహా మండలి సభ్యులు ఎం. సుబ్బయ్య ఆయనను ఆత్మీయంగా స్వాగతించి ఘనంగా సత్కరించారు.సమావేశంలో గిరిజన సంక్షేమానికి సంబంధించిన పలు అంశాలపై చర్చించినట్లు సమాచారం.

# విద్యార్థులు క్రమశిక్షణతో కూడిన విద్యను అభ్యసించాలి

**– డీసీసీ అధ్యక్షులు,కుడా చైర్మన్ ఇనగాల వెంకట్రామ్ రెడ్డి**

గాయత్రి వార్తలు




సెయింట్ తెరెసాస్ ఇంగ్లీష్ మీడియం హై స్కూల్‌లో "అకాడెమిక్ ఎక్సెలెన్స్ అవార్డు" ప్రదానోత్సవ కార్యక్రమంలో హన్మకొండ డీసీసీ అధ్యక్షులు,కుడా చైర్మన్ ఇనగాల వెంకట్రామ్ రెడ్డి పాల్గొన్నారు. విద్యార్థులు క్రమశిక్షణతో కూడిన విద్యను అభ్యసించి ఉన్నత శిఖరాలను అధిరోహించాలి హనుమకొండ డీసీసీ అధ్యక్షులు ఇనగాల వెంకట్రామ్ రెడ్డి ఆత్మకూరు విద్యార్థులు లక్ష్యశుద్ధితో చదివి సమాజానికి ఉపయోగపడే వ్యక్తులుగా ఎదగాలని హనుమకొండ జిల్లా కాంగ్రెస్ కమిటీ డీసీసీ అధ్యక్షులు మరియు కుడా చైర్మన్ ఇనగాల వెంకట్రామ్ రెడ్డి పిలుపునిచ్చారు. ఆత్మకూరు మండల కేంద్రంలోని సెయింట్ తెరెసాస్ ఇంగ్లీష్ మీడియం హై స్కూల్‌లో 2025-2026 విద్యా సంవత్సరానికి సంబంధించి ఏర్పాటు చేసిన "అకాడెమిక్ ఎక్సెలెన్స్ అవార్డు" ప్రదానోత్సవ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు.పాఠశాల ప్రిన్సిపాల్ సర్ జయిూస్ ఆహ్వానం మేరకు విచ్చేసిన ఇనగాల,ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు స్వయంగా అవార్డులు, ప్రైజులు అందజేసి,పిల్లలను అభినందించారు. అనంతరం పాఠశాల ప్రాంగణంలో విద్యార్థుల ప్రాక్టీస్ కోసం నూతనంగా ఏర్పాటు చేసిన 'క్రికెట్ లాంజ్'ను ఆయన ప్రారంభించారు. పాఠశాలలో అత్యాధునిక వసతులు కల్పిస్తున్న యాజమాన్యాన్ని ఆయన అభినందించారు.ఈ సందర్భంగా వెంకట్రామ్ రెడ్డి మాట్లాడుతూ చదువుతో పాటు క్రీడలు, క్రమశిక్షణ విద్యార్థి జీవితంలో కీలకమని, పాఠశాల దశ నుండే విద్యార్థులు తమ నైపుణ్యాలను మెరుగుపరుచుకోవాలని సూచించారు.విద్యార్థులు కేవలం పుస్తక జ్ఞానానికే పరిమితం కాకుండా, నాయకత్వ లక్షణాలను, క్రమశిక్షణను అలవర్చుకుని దేశానికి గర్వకారణంగా ఎదగాలి అని విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగించారు. నాణ్యమైన విద్యను అందిస్తూ విద్యార్థులను భావి భారత పౌరులుగా తీర్చిదిద్దుతున్న పాఠశాల యాజమాన్యాన్ని ఆయన అభినందించారు.ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచి పర్వతగిరి మహేశ్వరి పాఠశాల ప్రిన్సిపాల్, ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.

# అమ్రాబాద్ గ్యాస్ ఏజెన్సీలపై ఆకస్మిక తనిఖీలు చేపట్టిన ఎమ్మార్వో

**– బ్లాక్ లో సిలిండర్ అమ్మితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరిక**

గాయత్రి వార్తలు



నాగర్ కర్నూల్ జిల్లా అచ్చంపేట నియోజకవర్గం అమ్రాబాద్ మండలంలోని గ్యాస్ ఏజెన్సీ లపై రెవెన్యూ అధికారులు ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. ఈ క్రమంలో అమ్రాబాద్ మండల కేంద్రంలో ఉన్నటువంటి ఇండియన్ గ్యాస్ శివ ఏజెన్సీలో రెవెన్యూ అధికారులు తనిఖీలు చేపట్టి గోదాంలో ఉన్న స్టాక్ లెక్కపెట్టిన అధికారులు డొమెస్టిక్ సిలిండర్లు బ్లాక్ లో అమ్మినట్లయితే అట్టివారిపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ సందర్భంగా ఎమ్మార్వో రాములు మాట్లాడుతూ హోటల్స్ మరియు రెస్టారెంట్లలో ఉన్న లెక్కకు మించిన సిలిండర్లను సీజ్ చేస్తామని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో అమ్రాబాద్ మండల రెవెన్యూ అధికారులు రెవెన్యూ ఇన్-స్పెక్టర్ కృష్ణ మరియు జిపిఓ మహమూద్ తదితరులు పాల్గొన్నారు.

# టీవీ5 ఉగాది పంచాంగం ఆవిష్కరించిన మున్సిపల్ ఛైర్మన్

**స్థానిక నాయకులు మరియు జర్నలిస్టుల ఆధ్వర్యంలో ఆవిష్కరణ**

గాయత్రి వార్తలు



నాగర్ కర్నూల్ జిల్లా అచ్చంపేట నియోజకవర్గం లో శ్రీ పరాభవ నామ సంవత్సర ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకొని ప్రముఖ వార్తా సంస్థ టీవీ5 ఆధ్వర్యంలో రూపొందించిన ఉగాది పంచాంగం పుస్తకాన్ని అచ్చంపేట మున్సిపల్ చైర్మన్ గార్లపాటి శ్రీనివాసులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మన్ మాట్లాడుతూ తెలుగు సాంప్రదాయాలలో పంచాంగానికి ఎంతో ప్రాముఖ్యత ఉందని, ప్రజలకు రాశి ఫలాలు, తిథి, నక్షత్రాల సమాచారాన్ని అందించడంలో జర్నలిస్టుల కృషి అభినందనీయమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు మంత్రాల లాలు యాదవ్, తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ రాష్ట్ర నాయకులు చారకొండ బాలకృష్ణ మరియు జర్నలిస్ట్ మంత్రాల శ్రీనివాస్, ప్రముఖులు పాల్గొని అచ్చంపేట నియోజకవర్గం ప్రజానీకానికి మరియు ఎలక్ట్రానిక్ మీడియా మిత్రులకు, పాత్రికేయులకు ఉగాది శుభాకాంక్షలు తెలిపారు.

# ఘనంగా చలమాల వర్ధంతి

గాయత్రి వార్తలు



పెనుబల్లి మండల కేంద్రంలోని వి ఎం బంజర్ లో చలమల గంగాధర్ వర్ధంతి శుక్రవారం జరిగింది ఈ సందర్భంగా గంగాధర్ స్తూపం వద్ద సిపిఎం సత్తుపల్లి డివిజన్ కార్యదర్శి శీలం సత్యనారాయణ రెడ్డి జెండాని ఆవిష్కరించి నివాళులర్పించారు గంగాధర్ చిత్రపటానికి వీఎం బంజర సర్పంచ్ భూక్య ప్రసాద్ పూలమాల వేశారు మండల కార్యదర్శి గాయం తిరపతి రావు అధ్యక్షతన జరిగిన వర్ధంతి సభలో శీలం మాట్లాడుతూ పేదలకు ఇస్తున్న పథకాలపై మరిన్ని రాయితీలు ఇవ్వకుండా కార్పొరేట్ సంస్థలకు ప్రజాధనాన్ని కట్టబెడుతున్నారని ఆయన ఆరోపించారు ప్రజా సమస్యల పరిష్కారం కోసం కమ్యూనిస్టులు నిరంతర పోరాటం చేయడం ద్వారానే ఉపాధి హామీ చట్టం అటవీ హక్కుల చట్టం వంటి ప్రజాహిత కార్యక్రమాలను విజయవంతం చేయగలిగామన్నారు సాధించిన హక్కులను నేడు కేంద్ర ప్రభుత్వం కాల రాస్తుందని ప్రభుత్వ వ్యతిరేక విధానాలను తిప్పికొట్టేందుకు మేధావులు ప్రజాసంఘాలు ముందుండి పోరాడాలని పిలుపునిచ్చారు కార్యక్రమంలో జిల్లా కమిటీ సభ్యులు చలమాల విఠల్ రావు వి ఎం బంజర్ ఉపసర్పంచ్ తాళ్లూరు రవి నాయకులు చిట్టి మోదుల కృష్ణయ్య చెమట విశ్వనాథం కండే సత్యం మిట్టపల్లినాగమణి చలమాల నరసింహారావు మేకల బాజీ కలకోట వెంకటేశ్వర్లు వడ్డేపల్లి రవీంద్ర దండే వెంకటేశ్వరరావు పాల్గొన్నారు

# గోదావరిలో విషాదం.. 5 మంది బీటెక్ విద్యార్థులు గల్లంతు

గాయత్రి వార్తలు



భద్రాద్రి కొత్తగూడెం జిల్లా భద్రాచలం పరిధిలో గోదావరి నదిలో జరిగిన విషాద ఘటనలో ఐదుగురు బీటెక్ విద్యార్థులు గల్లంతయ్యారు. ఉగాది సెలవుల సందర్భంగా స్నేహితులతో కలిసి వచ్చిన వీరు నదిలో స్నానాలకు దిగగా ప్రమాదం చోటుచేసుకుంది.వివరాల ప్రకారం.. అమరావతి లోని ఎస్ఆర్ఎంటీ, కాలేజీలో బీటెక్ రెండో సంవత్సరం చదువుతున్న విద్యార్థులు, భద్రాచలం ప్రాంతానికి చెందిన తమ మిత్రులు అభిరామ్, శ్రీకర్‌లతో కలిసి ఎటపాక మండలం లోని పురుషోత్తమపట్నం గ్రామ శివారులో ఉన్న కొల్లిగూడెం ఇసుక ర్యాంప్ సమీపంలోని గోదావరి నది లోకి దిగారు. ఫోటోలు తీసుకుంటూ ఉండగా ఏడుగురు యువకులు అకస్మాత్తుగా ప్రవాహంలో కొట్టుకుపోయారు. వీరిలో ఇద్దరు ఈత రావడంతో ఒడ్డుకు చేరుకోగా, మిగిలిన ఐదుగురు గల్లంతయ్యారు. గల్లంతైన వారిని అభిరామ్, శ్రీకర్, తేజ, సతీష్, నవదీప్‌లుగా గుర్తించారు. ఇందులో అభిరామ్, శ్రీకర్ భద్రాచలం ప్రాంతానికి చెందినవారు. సమాచారం అందుకున్న వెంటనే పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని గజ ఈతగాళ్ల సహాయంతో గాలింపు చర్యలు ప్రారంభించారు. ప్రత్యేక రిస్క్యూ బృందం కూడా మృతదేహాల కోసం గాలిస్తోంది.

# బడ్జెట్ లో విద్యా రంగానికి కేటాయింపులు ఏవి??

**– జే.బీ.పీ స్టేట్ వర్కింగ్ ప్రెసిడెంట్ యెర్రా కామేష్**

గాయత్రి వార్తలు



కొత్తగూడెం: రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన బడ్జెట్ లో విద్యా రంగాన్ని పూర్తిగా నిర్వీర్యం చేసేలా ఉందని జై భీమ్ రావ్ భారత్ పార్టీ (జేబీపీ) స్టేట్ వర్కింగ్ ప్రెసిడెంట్ యెర్రా కామేష్ విమర్శించారు.బడ్జెట్ పై ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే విద్యా రంగానికి 15 శాతం నిధులను బడ్జెట్ లో కేటాయిస్తామని హామీ ఇచ్చి కేవలం 8.2 శాతం మాత్రమే నిధులు కేటాయించి చేతులు దులుపుకున్నారని,ఈ అరకొర నిధులు ఉద్యోగుల జీతభత్యాలకు కూడా సరిపోవని విమర్శించారు.3,24,234 కోట్లతో ప్రవేశ పెట్టిన బడ్జెట్ లో వైద్య రంగానికి కేవలం 13679 కోట్లను మాత్రమే కేటాయించి పేద ప్రజల ఆరోగ్యం పట్ల ప్రభుత్వానికి ఉన్న చిత్తశుద్ధిని నిరూపించుకున్నారని,జాబ్ క్యాలెండర్ పై ప్రస్తావించలేదని,ఆరు గ్యారంటీ ల అమలు పై బడ్జెట్ లో ఎక్కడ ప్రస్తావన లేదని,ఉద్యోగాలకు సంబంధించిన పీఆర్సీ పై ప్రకటన లేకపోవడం దారుణమన్నారు.రాజీవ్ యువ వికాసానికి పోయిన బడ్జెట్ లో 6 వేల కోట్లు కేటాయించి 6 పైసలు కూడా ఖర్చు చేయలేదని దెప్పిపొడిచారు.ఈ బడ్జెట్ అంకెల గారడి తప్ప సామాన్య,పేద ప్రజలకు వొనగూరింది ఏమి లేదని విమర్శించారు.



# ముంబై ఇండియన్స్ ఆటతీరును మార్చుకోబోతోంది

ఇండియన్ ప్రీమియర్ లీగ్ లో ఛాంపియన్లకే ఛాంపియన్ ముంబై ఇండియన్స్... చెన్నై సూపర్ కింగ్స్ తర్వాత ముంబై ఇండియన్స్ ఛాంపియన్ గా అవతరించింది. ఎన్నో విజయాలు సాధించింది... అడపాదడపా ఓటములతో అనుభవాలను నేర్చుకున్న ముంబై ఇండియన్స్ గత రెండు సీజన్లలో పేలవ ప్రదర్శనతో వెనుకబడింది. లోటుపాట్లను సరిదిద్దుకున్న ముంబై ఇండియన్స్... ఐపీఎల్ 2026 సీజన్ లో సత్తా చాటాలని ఎదురు చూస్తోంది. ప్రత్యర్థి జట్లపై విరుచుకుపడి భారీ స్కోర్లను సాధించాలనే లక్ష్యంతో జట్టును పటిష్టం చేసింది. అన్ని విభాగాల్లోనూ ప్రతిభావంతులతో టీమ్ ను తీర్చిదిద్దింది. ముంబై ఇండియన్స్ కెప్టన్ గా సుధీర్ఘ కాలం ప్రాతినిధ్యం వహించిన రోహిత్ శర్మ... హార్ధిక్ పాండ్యాకు బాధ్యతలు అప్పగించారు. విజయాలకు మారుపేరుగా ఉన్న ముంబై ఇండియన్స్... ఇపుడు పరాజయాల పరంపరను కొనసాగిస్తోంది. 2026 సీజన్ ను ప్రతిష్టాత్మకంగా తీసుకున్న ముంబై ఇండియన్స్... భారీ స్కోర్లను సాధించే దిశగా వ్యూహరచన చేస్తోంది. వేదిక ఏదైనా... ప్రత్యర్థి జట్టుతో పోటీపడి ఘన విజయాలను సొంతం చేసుకోడానికి సిద్ధమైంది. క్రీజులో నిలబడితే చాలు... హార్డ్ హిట్లతో స్కోరు బోర్డు అమాంతంగా పరుగులు పెట్టే విధంగా ముంబై ఇండియన్స్ ఆట సాగబోతోంది. టీ20 వరల్డ్ కప్ విన్నింగ్ కెప్టన్, డాషింగ్ బ్యాట్స్ మెన్ సూర్యకుమార్ యాదవ్ ముంబై ఇండియన్స్ తరఫున ఆడుతున్నాడు. టీమిండియాకు కెప్టెన్ గా ఉన్న సూర్యకుమార్ యాదవ్, ముంబై ఇండియన్స్ లో సాధారణ ఆటగాడిగా కొనసాగుతారా? హార్ధిక్ పాండ్యా నుంచి బాధ్యతలను సూర్యకుమార్ కు బదలాయిస్తారా? అనే ప్రశ్నలు చర్చనీయాంశంగా మారాయి. ముంబై ఇండియన్స్ తరపు రోహిత్ శర్మతోపాటు ఓపెనింగ్ బ్యాట్స్ మెన్ గా జతకట్టేది ఎవరు? క్రికెట్ అభిమానుల్లో ప్రశ్నలు తలెత్తున్నాయి. దక్షిణాఫ్రికా క్రికెటర్, కెప్టన్ గా ప్రాతినిధ్యం వహించిన క్వింటన్ డీకాక్, విల్ జాక్స్ ఇద్దరిలో ఒకరు ఓపెనింగ్ బ్యాట్స్ మెన్ గా దిగే అవకాశాలున్నాయి. తాజా సీజన్ లో ముంబై ఇండియన్స్ బ్యాటింగ్ బలం కీ రోల్ పోషించబోతోంది. ఓపెనర్లు పరుగుల వరద పారించే విధానాన్ని టాప్ ఆర్డర్ బ్యాట్స్ మెన్ అనుసరించే విధంగా ఆటగాళ్లను బరిలోకి దింపుతున్నారు. ముంబై ఇండియన్స్ లో రోహిత్ శర్మ, క్వింటన్ డీకాక్, సూర్యకుమార్ యాదవ్, రూథర్ ఫర్డ్, రియాన్ కికెల్టన్, తిలక్ వర్మ బ్యాటును ఝుళిపిస్తే... ఇక పరుగులే పరుగులు. దీన్ని బట్టి ముంబై ఇండియన్స్ భారీ స్కోర్లను సాధించబోతోందని స్పష్టంగా తెలుస్తోంది. గత రెండు సీజన్లలో వెనుకబడిన ముంబై ఇండియన్స్ ఈ సీజన్లో ఉనికి చాటుకోవడంతోపాటు ఆరోసారి ట్రోఫీని చేజిక్కుంచుకోవాలనే ప్రయత్నంలో ఉంది. ఈ ఆకాంక్షను బ్యాట్స్ మెన్లు బాధ్యతగా తీసుకుని పరుగులు నమోదు చేయాలనే సంకల్పంతో ఉన్నారు. టాప్ ఆర్డర్స్ తోడు ఆల్ రౌండర్లు హార్ధిక్ పాండ్యా, నమన్ ధీర్, మిచెల్ శాంట్నర్, విల్ జాక్స్ బ్యాటుతో విధ్వంసం సృష్టించాలని సన్నాహాలు చేస్తున్నారు. ఐపీఎల్ లో ప్రత్యర్థి జట్లను తక్కువగా అంచనా వేయకుండా... బౌలింగ్ దళంతో బోల్తా కొట్టించాలని చూస్తున్నారు. స్పెషలిస్ట్ వరల్డ్ క్లాస్ బౌలర్ ట్రెంట్ బౌల్ట్, మిస్టరీ స్పిన్నర్ అల్లా ఘజాన్ఫర్, స్పిన్ బౌలర్ మాయాంక్ మార్కండే, టీమిండియా యార్కర్ స్పెషలిస్ట్ , పేస్ బౌలర్ బుమ్రా, మాయాజాల బంతులతో బోల్తా కొట్టించే దీపక్ ఛాహర్, రఘుశర్మ బంతులతో ప్రత్యర్థి జట్లను ఆటకట్టించేందుకు వ్యూహాత్మకంగా వ్యవహరిస్తున్నారు. బౌలింగ్ దళంలో జస్ప్రీత్ బుమ్రా, ట్రెంట్ బోల్ట్ ప్రధాన ఫాస్ట్ బౌలర్లుగా ఉంటారు. మూడో పేసర్ స్థానానికి దీపక్ చాహర్ మరియు శార్దూల్ ఠాకూర్ మధ్య పోటీ ఉంది. చాహర్ ఫిట్‌గా ఉంటే స్వింగ్ బౌలింగ్ కారణంగా అతనికి ఎక్కువ అవకాశాలు ఉండొచ్చు. స్పిన్ విభాగంలో మిచెల్ సాంట్నర్ ప్రధాన ఎంపిక కాగా, మయాంక్ మార్కండే, అల్లా గజన్ఫర్ వంటి బౌలర్లు ఇంపాక్ట్ ప్లేయర్లుగా పరిగణిస్తారు. ఐపీఎల్ 2026 ప్రారంభానికి ముందే ముంబై ఇండియన్స్ జట్టు బలమైన స్క్వాడ్‌తో చర్చనీయాంశమైంది. కెప్టెన్ హార్దిక్ పాండ్యాకు ప్లేయింగ్ ఎలెవన్ ఎంపిక పెద్ద సవాలుగా మారింది. జట్టులో స్టార్ ఆటగాళ్లు ఎక్కువగా ఉండటంతో కొంత మంది ప్రముఖ క్రికెటర్లు ఈ సీజన్‌లో ఎక్కువగా బెంచ్‌పైనే కనిపించే అవకాశం ఉందని విశ్లేషకులు భావిస్తున్నారు.



## సన్‌రైజర్స్ కొత్త కెప్టెన్‌గా ఇషాన్

2026 ఐపీఎల్ ప్రారంభానికి ముందు సన్‌రైజర్స్ హైదరాబాద్ ఫ్రాంచైజీ కీలక ప్రకటన చేసింది. గాయం కారణంగా తమ రెగ్యులర్ కెప్టెన్ ప్యాట్ కమిన్స్ లీగ్‌లో ప్రారంభ మ్యాచ్‌లకు దూరం కానున్నాడు. దీంతో జట్టుకు కొత్త కెప్టెన్‌ను అనౌన్స్ చేసింది. యంగ్ టాలెంటెడ్ బ్యాటర్ ఇషాన్ కిషన్ తమ కొత్త కెప్టెన్‌గా ప్రకటించింది. ఇక మరో డాషింగ్ బ్యాటర్ అభిషేక్ శర్మను వైస్‌కెప్టెన్‌గా ప్రమోట్ చేసింది. కమిన్స్ గైర్హాజరీలో ఈ ఇద్దరూ జట్టును నడిపించనున్నారు. అయితే కమిన్స్ గాయం నుంచి పూర్తిగా కోలుకొని వచ్చిన తర్వాత మళ్లీ అతడికే కెప్టెన్సీ బాధ్యతలు అప్పగిస్తారు. ఈ మేరకు స్పష్టతనిస్తూ సన్‌రైజర్స్ సోషల్ మీడియాలో పోస్టు షేర్ చేసిది. కాగా, ఈ కొత్త ఎడిషన్ సన్‌రైజర్స్ మ్యాచ్‌తోనే ప్రారంభం కానుంది. మార్చి 28న సన్‌రైజర్స్– ఆర్సీబీ బెంగళూరు చిన్నస్వామి వేదికగా తలపడనున్నాయి. అయితే కొన్ని నెలలుగా కమిన్స్ వెన్ను నొప్పితో ఆటకు దూరమయ్యాడు. గతేడాది యాషెస్ సిరీస్ మధ్యలోనే వైదొలిగాడు. ఈ సిరీస్‌లో ఒకే ఒక్క టెస్టు మ్యాచ్ ఆడాడు. ఆ తర్వాత టీ20 వరల్డ్‌కప్ టోర్నమెంట్‌కు సైతం కమిన్స్ దూరంగా ఉన్నాడు. అయితే ఐపీఎల్ ప్రారంభం నాటికి కోలుకుంటాడని ముందుగా భావించారు. కానీ, కమిన్స్ ఫుల్ ఫిట్‌గా వచ్చేందుక ఇంకాస్త సమయం పట్టే అవకాశం ఉంది. దీంతో సన్‌రైజర్స్ ఈ ప్రకటన చేసింది. అయితే కమిన్స్ నాయకత్వంలో సన్‌రైజర్స్ బలమైన జట్టుగా తయారైంది. దూకుడుగా ఆడుతూ ప్రత్యర్థులకు వణుకు పుట్టించింది. జట్టులోని ఆటగాళ్లంతా అగ్రెసివ్ అప్రోచ్‌తో తొలి బంతి నుంచే బౌండరీలు బాదడం అలవాటుగా మార్చుకున్నారు. ఫలితంగా ఐపీఎల్ చరిత్రలో అత్యధిక స్కోర్లు బాదిన జాబితాలో తొలి నాలుగు స్థానాలు సన్‌రైజర్స్ పేరిటే నిలిపారు. 2024లో ఆర్సీబీపై 20ఓవర్లలో సన్‌రైజర్స్ 287–3 పరుగుల భారీ స్కోర్ చేసింది. ఐపీఎల్‌లో ఓ జట్టు చేసిన అత్యధిక స్కోర్ ఇదే. ఆ తర్వాత 286–6 (2025లో), 278–3 (2025లో), 277–3 (2024లో) వరుస స్థానాలు సన్‌రైజర్స్‌వే కావడం విశేషం. ఇక కమిన్స్ రాక ఆలస్యం కానుండడంతో ఓపెనర్లు ఇషాన్– అభిషేక్‌కు ప్రమోషన్ దక్కినట్టైంది. అయితే ప్రస్తుతం ఇషాన్ వయసు 27ఏళ్లు. దీంతో ఈ నిర్ణయం తాత్కాలికంగానే కాకుండా దీర్ఘకాల ప్రయోజనాలు దృష్టిలో పెట్టుకొని చేసి ఉండవచ్చు. ప్రస్తుతం కమిన్స్ వయసు 32ఏళ్లు. అంటే ఇంకో రెండు లేదా మూడేళ్లు అతడు జట్టులో ఆడే అవకాశం ఉంది. అందుకే కమిన్స్ వారసుడిగా ఇషాన్‌కు ఎంపిక చేసినట్లు అనిపిస్తుంది. దీంతో ముమ్ముందు ఇషాన్‌కే పూర్తిగా జట్టు బాధ్యతలు ఇవ్వడం ఖాయంగా కనిపిస్తుంది.వాస్తవానికి జట్టును నడిపించడం ఇషాన్‌కు కొత్తేం కాదు. అతడు గతేడాది దేశవాళీ టోర్నీ సయ్యద్ ముస్తాక్ అలీలో ఝార్ఖండ్ జట్టుకు నాయకత్వం వహించాడు. ఆ టోర్నీలో తన బ్యాటింగ్‌తోపాటుగా కెప్టెన్సీ స్కిల్స్‌తో ఆకట్టుకున్నాడు. ఏకంగా జట్టును ఛాంపియన్‌గా నిలిపాడు. ఇప్పుడు అదే అనుభవంతో ఐపీఎల్‌లోనూ సన్‌రైజర్స్‌ను ముందుకు నడిపించేందుకు సిద్ధమవుతున్నాడు. సన్‌రైజర్స్ జట్టు 2026 : అభిషేక్ శర్మ, అనికేత్ వర్మ, బ్రైడన్ కార్సే, ఎషాన్ మలింగ, హర్ష్ దూబే, హర్షల్ పటేల్, హెన్రిచ్ క్లాసెన్, ఇషాన్ కిషన్, జయదేవ్ ఉనద్కత్, కమిందు మెండిస్, నితీష్ కుమార్ రెడ్డి, పాట్ కమిన్స్, స్మరణ్ రవిచంద్రన్, ట్రావిస్ హెడ్, సల్లిల్ అరోరా, లియామ్ లివింగ్‌స్టోన్ , జాక్ ఎడ్వర్డ్స్, అమిత్ కుమార్, క్రెయిన్స్ ఫులేత్రా, షకిబ్ హుస్సేన్, ఓంకార్ తర్మలే, ప్రఫుల్ హింగే, శివమ్ మావి

## సన్‌రైజర్స్ మార్చి 22న ఈవెంట్ కోసం ఫ్రీ టికెట్లు

ఐపీఎల్ 2026 సీజన్ ఉత్సాహంలో ఉన్న సన్‌రైజర్స్ హైదరాబాద్ ఫ్రాంచైజీ ఆరెంజ్ ఆర్మీ అభిమానులకు ఒక అద్భుతమైన అవకాశం కల్పిస్తోంది. సన్‌రైజర్స్ తారలను అత్యంత దగ్గరగా కలుసుకునేందుకు 'మీట్ ద రైజర్స్' పేరుతో ఒక ప్రత్యేకమైన ఈవెంట్‌ను నిర్వాహకులు ప్లాన్ చేశారు. ఈ భారీ కార్యక్రమం మార్చి 22న హైదరాబాద్ నగరంలో అట్టహాసంగా జరగనుంది. ఈ విషయాన్ని టీమ్ మేనేజ్మెంట్ అధికారిక సోషల్ మీడియా పేజీ ద్వారా వెల్లడించారు. ఎప్పుడూ టీవీల్లో లేదా స్టేడియం స్టాండ్స్‌లో చూసే తమ అభిమాన ఆటగాళ్లతో ముఖాముఖి మాట్లాడేందుకు ఈ మీట్ అండ్ గ్రీట్ ఈవెంట్ ఒక అరుదైన వేదికగా నిలవనుంది. ఈ కార్యక్రమానికి ఉచిత ప్రవేశం కల్పిస్తున్నప్పటికీ, కేవలం 1000 మంది అదృష్టవంతులైన అభిమానులకు మాత్రమే ఇందులో పాల్గొనే అద్భుత అవకాశం దక్కుతుంది. ముందుగా రిజిస్టర్ చేసుకున్న మొదటి వెయ్యి మందికి ఈ ఉచిత పాస్‌లు లభిస్తాయి. ఆరెంజ్ ఆర్మీ ఫ్యాన్స్ అంతా ఈ అద్భుత క్షణాల కోసం ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. సన్‌రైజర్స్ అధికారిక సోషల్ మీడియా ఖాతాల్లో రేపు ఉదయం పోస్ట్ చేసే ప్రత్యేక లింక్‌పై క్లిక్ చేసి, యాప్‌లో సూచించిన విధంగా రిజిస్ట్రేషన్ ప్రక్రియను వేగంగా పూర్తి చేయాలి. ఇక్కడ గమనించాల్సిన అతి ముఖ్యమైన విషయం ఏమిటంటే.. ఒక్కో వ్యక్తికి కేవలం ఒక టికెట్ మాత్రమే కేటాయిస్తారు. పరిమిత సంఖ్యలో పాస్‌లు అందుబాటులో ఉన్నందున, బుకింగ్ ఓపెన్ అయిన వెంటనే త్వరపడి టికెట్‌ను దక్కించుకోవాలి. మార్చి 22న జరగనున్న ఈ కార్యక్రమం అభిమానులు, ఆటగాళ్ల మధ్య బంధాన్ని మరింత దృఢం చేయనుంది. సన్‌రైజర్స్ ఆటగాళ్లతో సరదాగా ముచ్చటించడం, వారితో సెల్ఫీలు దిగడం, పంచుకున్న మధురమైన జ్ఞాపకాలను పదిలపరుచుకునేందుకు ఫ్యాన్స్‌కు ఇదొక అద్భుత వేదిక. రాబోయే ఐపీఎల్ సీజన్ కోసం ఆరెంజ్ ఆర్మీకి మరింత జోష్ నింపేలా ఫ్రాంచైజీ ఈ ఈవెంట్‌ను భారీ స్థాయిలో ప్లాన్ చేస్తోంది. భద్రతా కారణాల దృష్ట్యా ఈవెంట్ జరగబోయే కచ్చితమైన వేదిక వివరాలను నిర్వాహకులు బహిర్గతం చేయలేదు. టికెట్ కన్ఫర్మ్ అయిన అభిమానులకు మాత్రమే వేదిక వివరాలను నేరుగా తెలియజేస్తారు. ఇంకెందుకు ఆలస్యం.. వెంటనే డిస్ట్రిక్ట్ యాప్ డౌన్‌లోడ్ చేసుకుని రేపు ఉదయం 11:30 గంటలకు మీ అదృష్టాన్ని పరీక్షించుకోండి.



## వైభవ్ గేమ్ ప్లాన్ రివీల్ చేసిన శాంసన్

2026 ఐపీఎల్ ప్రారంభానికి రోజులు దగ్గరపడుతున్నాయి. ఇదే నెల 28న కొత్త సీజన్ గ్రాండ్?గా షురూ కానుంది. ఈ క్రమంలో మరోసారి అందరి చూపు యువ సంచ?లనం వైభవ్ సూర్యవంశీపైనే నెలకొంది. గతేడాది ఐపీఎల్?లో అరంగేట్రం చేసి విధ్వంసం సృష్టించిన ఈ చిచ్చరపిడుగుపై ఈసారి భారీగా అంచనాలు నెలకొన్నాయి. ఈ క్రమంలో వైభవ్ గురించి శాంసన్ ఓ ఆసక్తికర విషయం బయట పెట్టాడు. మార్చి 15న బీసీసీఐ దిల్లీ వేదికగా నమన్ అవార్డుల ప్రధానోత్సవ కార్యక్రమం నిర్వహించింది. ఈ ఈవెంట్?లో ఇటీవల వరల్డ్?కప్ సాధించిన మహిళల, పురుషుల జట్లను సన్మానించారు. వైభవ్ సూర్యవంశీ కూడా ఈ కార్యక్రమానికి వచ్చాడు. అతడు తన సీనియర్లు హార్దిక్ పాండ్య, అభిషేక్ శర్మ, సంజు శాంసన్?తో కలిసి క్వశ్చన్ సెషన్?లో పాల్గొన్నాడు. అందులో వైభవ్?కు హోస్ట్ ఆసక్తికర ప్రశ్నలు అడిగాడు. ఐపీఎల్?లో తాను ఎదుర్కొన్న తొలి బంతి ఎక్కడికి వెళ్లింది అని అడగ్గా, 'లఖ్?నవూ సూపర్ జెయింట్స్?పై డెబ్యూ మ్యాచ్ ఆడాను. ఆ మ్యాచ్?లో నేను ఎదుర్కొన్న తొలి బంతినే కవర్స్ మీదుగా సిక్స్? కొట్టాను' అని వైభవ్ రిప్లై ఇచ్చాడు. 'అయితే మీ కోచ్ ఇక్కడే ఉన్నాడు (రాహుల్ ద్రవిడ్?ను ఉద్దేశిస్తూ). ఆయన టెస్టుల్లో ఓపిగ్గా ఆడుతూ రెండు రోజులు కూడా బ్యాటింగ్ చేయగలడు. అలాంటిది నువ్వు తొలి బంతినే సిక్స్? కొడతానని చెప్పినప్పుడు ఆయన రియాక్షన్ ఏంటి?' అని అడిగాడు. దీనికి వైభవ్ సమాధానం చెబుతుండగా, అక్కడే ఉన్న శాంసన్ మధ్యలో కల్పించుకొని వివరంగా చెప్పాడు. "లఖ్?నవూతో మ్యాచ్? ముందు రోజు ద్రవిడ్ సర్ నన్ను, వైభవ్?ను రూమ్?కు పిలిచాడు. 'వైభవ్ చాలా చిన్నపిల్లవాడు. ఎలా ఆడాలి? ఎలా ముందుకెళ్లాలో మనం అతడికి చెప్పాలి' అని సర్ అన్నాడు. వెంటనే 'వైభవ్ నీ గేమ్? ప్లాన్ ఏంటి?' అని రాహుల్ సర్ అతడిని అడిగాడు. దీనికి అతడు 'ప్లాన్ అంటూ ఏమీ లేదు సర్, అవకాశం వస్తే తొలి బంతినే గాల్లోకి లేపేయడమే' అని చెప్పాడు. అతడు వీడియో గేమ్ ఆడుతున్నాడా? ఏంటి అని నేను అప్పుడే అనుకున్నా" అని శాంసన్ నవ్వుతూ వైభవ్ అరంగేట్రం కంటే ముందు జరిగిన సంభాషణను షేర్ చేసుకున్నారు. ఆ సంభాషణలో చెప్పినట్లే వైభవ్ ఆ మ్యాచ్?లో తాను ఎదుర్కొన్న తొలి బంతినే సిక్స్?గా మలిచాడు. కాగా, గతేడాది లఖ్?నవూతో జరిగిన మ్యాచ్?తో వైభవ్ ఐపీఎల్?లో అరంగేట్రం చేశాడు. ఈ మ్యాచ్?లో ఓపెనర్?గా బ్యాటింగ్?కు దిగిన వైభవ్ తాను ఎదుర్కొన్న తొలి బంతినే సిక్స్?గా మలిచి ఔరా అనిపించాడు. శార్దూల్ ఠాకూర్ వేసిన ఆ ఓవర్? నాలుగో బంతిని వైభవ్ కవర్స్ దిశగా స్టాండ్స్?కు పంపించాడు. అలా ఐపీఎల్? కెరీర్?ను సిక్స్?తో ఆరంభించిన అతికొద్దిమంది క్రికెటర్లలో ఒకడిగా నిలిచాడు. ఆ తర్వాత గుజరాత్?తో మ్యాచ్?లో 35 బంతుల్లోనే సెంచరీ సాధించి సరికొత్త రికార్డ్ కొట్టాడు. ఇక ఇదే ఈవెంట్?లో పలు ఇంట్రెస్టింగ్ కామెంట్స్ చేశాడు. ఈసారి రాజస్థాన్ రాయల్స్ జట్టును ఐపీఎల్?లో ఛాంపియన్‌గా నిలపడమే తన ఏకైక లక్ష్యమని వైభవ్ పేర్కొన్నాడు. "నేను వ్యక్తిగతంగా రాణించగలిగితే, దాని ప్రయోజనం మొత్తం జట్టుకు దక్కుతుంది. ఘూా వంటి భారీ టోర్నమెంట్‌లో ట్రోఫీని గెలవడం ప్రతి ఆటగాడి కల. ఆ దృఢ సంకల్పంతోనే నేను కూడా బరిలోకి దిగుతాను" అని అన్నాడు. అలాగే ఐపీఎల్?లో తాను ఏ రికార్డును బ్రేక్ చేయాలని అనుకుంటున్నావని అడగ్గా, లెజెండరీ క్రికెటర్ క్రిస్ గేల్ నెలకొల్పిన 175 పరుగుల రికార్డును తాను బద్దలు కొట్టాలని అనుకుంటున్నట్లు చెప్పాడు.2013 సీజన్‌లో రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు తరపున ఆడిన క్రిస్ గేల్, చిన్నస్వామి స్టేడియంలో పూణె వారియర్స్ ఇండియా జట్టుపై కేవలం 66 బంతుల్లోనే అజేయంగా 175 పరుగులు సాధించాడు. ౨20 క్రికెట్ చరిత్రలో ఇదే అత్యధిక వ్యక్తిగత స్కోరు.



GAYATHRI VARTHALU Publisher, Editor and Owned by Maddineni Nageswara Rao, SVN Colony, Guntur, Andhra Pradesh - 522006. PRGI Reg No - APTEL/25/A1201 .. Cell No - 7386045673 ..... Printed At SUNDAY PRINTING PRESS, SVN Colony, Guntur, Andhra Pradesh - 522006 ..Cell No - 7386045673.